


# ప్రకృతి కిరణం

"నేను వాల్వు తెరుస్తాను. నువ్వు పంపు స్టార్టు చేసి వెళ్ళి, ట్యాంకులో ఏసిడ్ పడుతూందో, లేదో చూడు'' అన్నాడు రాజన్.

అలాగే నన్నట్టు తల పంకించి పంపు ఆన్ చేశాను.

పెద్ద శబ్దంతో ఏసిడ్ పంపు చేయుటం ఆరంభమయింది. పంపుపై ఉన్న గొట్టాన్ని చేతులతో తాకి చూశాను. త్వరితంగా వేడెక్కుతూంది. అంటే, ఏసిడ్ వెళుతూందన్న మాట. సందేహం లేదు.

దారిలో మిగిలిన వాల్వు లన్నీ తెరిచి ఉన్నాయో, లేదో మరొకసారి చూసుకొని ట్యాంకు మీదకు వెళ్ళాను. రాజన్ వాల్వు పూర్తిగా తెరిచి మేడమెట్లు ఎక్కి కంట్రోలు రూము వైపు వెళ్ళి పోయాడు.

ట్యాంకు మీదకు చేరుకునేసరికి ఏసిడ్ పొగలు చుట్టుముట్టాయి. ఊపిరి సలపక ఉక్కిరి బిక్కిరి ఆయ్యాను. ఫాస్ఫారిక్ ఏసిడ్‌తో వచ్చిన చిక్కే ఇది. సల్ఫ్యూరిక్ ఏసిడ్‌కు మల్లే ఇది ప్రమాదకరమయినది కాదు. చల్లని ఏసిడ్. మీద పడినా కాలదు. కాని విపరీతమయిన పొగలు. పొగ పీలిస్తే కళ్ళు మంటలు. ముక్కు మండిపోతుంది. విపరీతమయిన తలనొప్పి ఆరంభమవు తుంది. ముక్కుమీద ఉన్న గుడ్డ మాస్కు సవరించుకొని, ఏసిడ్ పడుతున్న లోపలి వైపు వెళ్ళాను. గొట్టంలోనుండి దట్టంగా పడుతూంది. అంటే, పంపు బాగా

చేస్తుందన్న మాట. ఇక అక్కడ నిలబడలేక గబగబా కిందకు దిగి వచ్చేశాను. అరగంటలో ఏసిడ్ పంపటం పూర్తి అయింది. పంపు ఆపేసి ముఖం, చేతులు కడుక్కొని నా కాబిన్‌లోకి వెళ్ళి కుర్చీలో కూలబడ్డాను.

ఎదురుగా ఉన్న పానల్ మీద ఆకుపచ్చ దీపాలన్నీ నిబ్బరంగా వెలుగుతున్నాయి. పంపుల మోటర్లన్నీ ఒకసారి చూసుకొని, రీడింగులన్నీ లాగ్ షీటులో ఎక్కించి సావధానపడ్డాను. కాబిన్‌లో కూర్చుని అద్దాల తలుపుల గుండా అవతలకు చూస్తే సాయంకాలపు దృశ్యం అతి మనోహరంగా కనిపిస్తోంది.

పగిలినట్లున్న సూర్యబింబం పశ్చిమాద్రిని చేరుకుంటూంది. కుంకుమ ఒలకబోసినట్లు పశ్చిమ దిక్కు అరుణ వర్ణం పులుముకొంది. కొంచెం అవతలనున్న సల్ఫ్యూరిక్ ఏసిడ్ ప్లాంటు పొగ గొట్టంలోనుండి సన్నని తెల్లటి పొగలు లేచి గాలిలో వలయాలు తిరిగి పక్కలకు పరుచుకుంటున్నాయి. పొగ గొట్టం వెనకనున్న బోయిలర్ నుండి దట్టమైన ఆవిరి బయటకు వచ్చి మబ్బు పింజలకు మల్లే విడిపోతూంది. కొండల మధ్యకు జారిపోతున్న సూర్యబింబం పొగల మధ్య నుండి చూస్తే మరిన్ని సోయగాలు సంతరించుకొని దర్శనమిస్తోంది. కాస్త అవతల పెద్ద కన్వేయర్ బెల్టు మీదుగా పచ్చని పసిడి ముద్దలా మెరుస్తున్న గంధకం మెల్లగా కదిలి గోడౌన్ వైపు సాగిపోతూంది. దూరంగా ప్రకృతి సౌందర్యాన్ని ఆకళించుకున్న దట్టమైన తాటితోపు. మెడలు సాచి నిటారుగా నిలబడి ఆకాశంలోకి తొంగి చూస్తున్నాయి చెట్లు. ఆ దృశ్యాన్ని తదేకంగా చూస్తూ ఉంటే గొప్ప చిత్రకారుడు గీసిన మహత్తరమయిన చిత్రాన్ని చూస్తున్న అనుభూతి కలుగుతూంది.

ఫోన్ వచ్చిన సూచనగా కాబిన్‌లో ఎర్రదీపం వెలిగింది. ఫోన్ అందుకొని రాజన్‌తో మాట్లాడాను. అతనికి కావలసిన వివరాలన్నీ అందజేసి ఫోన్ పెట్టేశాను. అంతలో అద్దం అవతలి వైపు ఉన్న చిన్న పైపులైను మీద ఒక పక్షి వచ్చి వాలింది. అందంగా తోక ఆడిస్తూ, కళ్ళు చకచకా ఇటూ అటూ తిప్పుతూ పరిసరాలను పరికిస్తోంది. వింత వింత రంగులతో ఎంతో అందంగా ఉంది అది. తలమీద చిన్న పింఛం లేత నీలం రంగులో రెపరెప లాడుతూంది. ఆ పక్షి ముక్కుతో ఒక పుడక కరుచుకు వచ్చింది. లైను మీద నిలబడి అది తోక ఆడించే సమయంలో ముక్కున ఉన్న పుల్ల కాస్తా నేలమీద పడిపోయింది. పడిపోయిన పుల్ల వంకే రెండు క్షణాలు కళ్ళు నిలిపి చూసింది.

నేను విస్మయంతో దానివంకే చూస్తున్నాను. సాధారణంగా ప్లాంటులోకి పక్షులేమీ రావు. విపరీతమయిన పొగలు, భరించలేని ఘాటయిన వాసన అందుకు కొంతవరకూ కారణాలు. కాని, దాని ముక్కున కరుచుకు వచ్చిన పుల్లను చూస్తుంటే అది ఈ పరిసరాల్లో ఎక్కడో గూడు కడుతున్నట్లుంది. రెండు క్షణాలు తోకాడిస్తూ చెంగు చెంగున పైపులైను మీద ఇటూ అటూ గెంతింది. తరవాత రివ్వున రెక్కలు ఆడిస్తూ కిందకు దుమికి నేలనున్న పుడక ముక్కున కరుచుకొని వేగంగా ఎగిరి కాస్త దూరంలో ఉన్న మరో గొట్టంమీద వాలింది. ఎందుకో

## ద్విభాష్యం రాజేశ్వరరావు

దాన్ని గమనించాలనే ఆసక్తి పెరిగింది. మెల్లగా కాబిన్ తలుపులు తెరుచుకొని బయటకు వచ్చాను. నా ఊహ నిజమయింది. ఆ పక్షి నిలబడిన పైపు లైను కిందిభాగంలో ఎలెక్ట్రిక్ కేబిల్స్ మీద గూడు కనుపించింది. అప్పుడే గూడు అంతా పూర్తి అయిపోయింది. తాను అప్పుడు తెచ్చిన పుల్లకూడా గూటిపై ఒక వారగా ఉంచింది. అంతలోనే పుల్లల మధ్యకు దూరి మాయమయింది.

నాకు ఆ పక్షి చర్యల ఎడల ఆత్రత పెరిగింది. గూడు దగ్గరగా చూడాలనే కాంక్ష అధికమయింది. కాస్త ఎడంగా ఉన్న ఇనప నిచ్చెన సహాయంతో మెల్లగా పైకి ఎక్కి వెళ్ళాను. నా అలికిడి వినగానే గూటిలోంచి పక్షి బయటకు వచ్చి తుర్రున పారిపోయింది. కాస్త ఎడంగా నిలబడి గూటివంక చూశాను. ఏ ఇంజనీరింగ్ సూత్రాలకూ అందని రహస్యం ప్రకృతి నేర్పుతుంది కాబోలు! పుల్లలన్నీ చిత్రంగా పేర్చి ఉన్నాయి. ఎవరో సక్రమమయిన ధోరణిలో చక్కగా తీర్చి దిద్దినట్లుంది ఆ గూడు. పుల్లలు బాగా ఎత్తువరకూ జోడించి మధ్యలో విశాలమయిన చోటు వచ్చేటట్లు ఏర్పాటు చేసుకొంది. దూది, చిత్తిక వంటి మెత్తని వస్తువు లెన్నో ఆ గూటిలో చేర్చింది. అంతలోనే గూటిలో కొంత కదలిక కనుపించింది. కదలికతో బాటు సన్నని సవ్వడి వినిపించింది. ఆశ్చర్యంతో మరికాస్త చేరువగా జరిగి నిశ్శబ్దంగా తొంగి చూశాను. గూడు బాగా లోతుకు ఉంది. మధ్యలో తల్లిపక్షి, రెండు పిల్లలు ఉన్నాయి. తల్లి పక్షికి మగపక్షికి మల్లే తలమీద పింఛం లేదు. పిల్లలకు ఇంకా కనులుకూడా విడినట్లు లేదు. మెడ ఎత్తి తడుములాడుతూ తల్లి చేరువలో కువకువ లాడుతున్నాయి. తల్లిపక్షి సుతారంగా తన ముక్కుతో వాటి మెడల మీద రాస్తూంది.

రెండు క్షణాలు వాటి వంక చూసి కిందకు దిగిపోయాను. నేను చూసినట్లు పోలిస్తే భయపడి గూడు మార్చేస్తుందని భయంకూడా వేసింది. వాటిని అదిలించటం ఇష్టంలేక దూరంగా వచ్చేశాను.

ఆ గూటిమీదుగా సల్ఫ్యూరిక్ ఏసిడ్ లైను వెళుతూంది. ఆ గొట్టం ఎప్పుడూ వేడిగానే ఉంటుంది. ఆ వెచ్చదనం కోసం అవి అక్కడ గూడు కట్టుకున్నాయి కాబోలు. అయితే, అంతలోనే ఒక భయంకరమయిన ఆలోచన నా మెదడులోకి వచ్చింది. సరిగ్గా గూటి పైభాగంలో లైనుమీద జాయింటు ఉంది. నెలకు ఒకటి రెండు సార్లయినా ఒత్తిడి వల్ల అది పగిలి ఏసిడ్ పైన పడుతూ ఉండటం జరుగుతుంది. 'ఈ సారి అది పగిలితే?' ఇక ఆలోచించలేకపోయాను. ఏసిడ్ సరిగ్గా గూటిలోనే పడుతుంది. 'పోనీ, అక్కడినుండి వాటిని తరిమేద్దామా?' అనిపించింది. తరిమేస్తే కళ్ళు విడని ఆ పిల్లలు కాకులకో, గద్దలకో చిక్కటం ఖాయం. వాటి మానాన వాటిని వదిలివేయటమే ఉత్తమమనిపించింది.

ఈ ఆలోచనల మధ్య ఉండగా రాజన్ కంట్రోలు రూము నుండి కిందకు దిగి వచ్చాడు. అతని ముఖం పాలిపోయి ఉంది. నేను మాట్లాడబోయే లోపున విషం లాంటి వార్తని వినిపించాడు. "మన వినయ్ మనకిక లేడు" అన్నాడు బొంగురుపోయిన కంఠంతో.

నేను షాక్ తిన్నట్లయ్యాను.

ఆ ముందు రోజే అతనికి తీవ్రమయిన కడుపు నొప్పి వస్తే హాస్పిటల్‌లో చేర్చాం. 'ఎపెండిసైటిస్' అని ధ్రువపరిచారు డాక్టర్లు. ఈ ఉదయం ఆపరేషను చేశారు. అయినా ఫలితం దక్కలేదన్న మాట. నిన్నటి వరకూ మా మధ్య తిరుగుతూ, మాతో బాటు ఆపరేటరుగా పనిచేసిన వినయ్ ఇక లేడన్న సత్యం నమ్మలేనిదైనా, సత్యదూరం మటుకు కాదు. మరోసారి హాస్పిటల్‌కు ఫోన్ చేసి వాస్తవాన్ని ధృవపరుచుకున్నాం. అతని ఆత్మ శాంతి కోసం అందరం రెండు నిమిషాల మౌనం పాటించాం. డ్యూటీ నుండి ఇంటికి తిరిగి వెళ్ళేటప్పుడు హాస్పిటల్‌కు వెళ్ళి వినయ్ భౌతికకాయాన్ని కడసారిగా వీక్షించి రెండు కన్నీటిబొట్లు విడిచాం. అతని శవం పక్కన కూర్చుని దీనంగా రోదిస్తున్న అతని భార్యను చూస్తే హృదయం తరుక్కుపోయింది. ఇంకా మూడు పదులయినా నిండని ఆమెకు తీరని కష్టం వచ్చింది. అయిదేళ్ళ లోపు వయస్సులో ఉన్న పిల్లలిద్దరినీ తండ్రి కాళ్ళ దగ్గర పడేసి, చీరకొంగు నోట్లో కుక్కుకొని అతి దీనంగా విలపిస్తూంది. ఏ దేవుడూ ఆమె మొర ఆలకించడని తెలిసినా, పోయిన భర్తను తిరిగి ఇమ్మని అందరి దేవుళ్ళకూ మొక్కుతూంది!

ఆ దృశ్యం చూడలేక పైకి వచ్చేశాం. బయట వరండాలోకి వచ్చాక రాజన్



వెక్కిరింపా? ఫొటో—వి. కృష్ణారావు (వెల్నూరు).

అన్నాడు: "వినయ్‌కి పెద్ద ఆస్తి ఏమీ లేదు. జీతంకూడా పెద్దగా వచ్చేదేమీ లేదు. ఉన్న ఆయిదారు వందలూ ఇప్పుడు ఖర్చులకే సరిపోతాయి. ఆవిడ ఆ పిల్లల్ని ఎలా పోషిస్తుందో?" మా మిత్రులందరం కలిసి ఆర్థికంగా ఆమెకు కొంత సహాయం చేసేందుకు ఆలోచిస్తే బాగుంటుందనే నిశ్చయానికి వచ్చాం.

ఆమె పైన చాలా పెద్ద భారాన్నే మోపి పోయాడు వినయ్.

● ● ●

వారం దినాలు గడిచిపోయాయి.

యంత్రాల మధ్య యంత్రాలమయి తిరుగుతూ వినయ్‌ను గురించిన జ్ఞాపకాలను అప్పుడే దూరం చేసుకుంటున్నాం. సముద్రఘోష లాటి పంపుల శబ్దాలు మిగిలిన దైనందిన జ్ఞాపకాల నుండి తరిమి బాధ్యతల మధ్య కట్టి పడేస్తున్నాయి. ఏ భోజనాల సమయంలోనో మా మధ్య ఒక కారియరు తక్కువయితే, ఒక కుర్చీ ఖాళీగా ఉండిపోతే, ఆ సమయంలో మెరుపులా మెదులుతున్నాడు వినయ్. చిరునవ్వు చెదిరే అతని ముఖం, కాంతి వంతమయిన కళ్ళూ మా ఎదుట నిలుస్తున్నాయి. అంతే. తరవాత అంతా మామూలే.

ఆ సాయంకాలం పంపులన్నీ చెక్ చేసుకొని నా కాబిన్‌లోకి వెళ్ళబోతున్నాను. అంతలోనే పంపుల హోరును చీలుస్తూ కేరుమంటూ అరుపు వినిపించింది. చటుక్కున తల ఎత్తి చుట్టూ చూశాను. అప్రయత్నంగా నా చూపు సల్ఫ్యూరిక్ ఏసిడ్ లైను వైపు వెళ్ళింది. నేను అనుకున్నంతా అయింది!

ఘోరం జరిగిపోయింది.

సరిగ్గా పక్షి గూటిమీది జాయింటు పగిలింది. సన్నని ధారతో సల్ఫ్యూరిక్ ఏసిడ్ గూటిమీద పడుతూంది.

నాకు క్షణంసేపు ఏం చేయాలో తోచలేదు.

ఏసిడ్ ధార ఆగకపోతే ఆ పక్షులన్నీ చావటం ఖాయం. పెద్దవి రెండూ తప్పించుకున్నా, పిల్లలు రెండూ బలి అయిపోతాయి.

అంతలోనే ఏదో స్ఫురించినట్లయింది. పరుగున వెళ్ళి ఆ గొట్టంలోకి ఏసిడ్ పంపే పంపు ఆపేశాను. ధార ఆగిపోయినా, సన్నగా చుక్కల్లా స్వల్పంగా ఏసిడ్ ఇంకా పడుతూంది. గబగబా ఇనుపనిచ్చెన ఎక్కి పైకి వెళ్ళాను. గూటిలోని దృశ్యం చూసి స్తంభీభూతుడ నయ్యాను. ఏదో మహత్తరమయిన దృశ్యాన్ని చూస్తున్నట్లు మెదడు కొన్ని క్షణాల సేపు ఆలోచనకు దూరమయింది.



సహ భోజనం

ఫొటో—డి. పున్నయ్య (నందిగామ)

మగపక్షి తన రెక్కలు విసనకర్రలా విప్పి మిగిలిన వాటిమీద ఏసిడ్ పడకుండా గొడుగులా పట్టింది. ఎంతో సుకుమారంగా ఉన్న దాని రెక్కల మీద ఏసిడ్ పడి సున్నని ఈకెలపైనుండి కిందకు జారిపోతూంది. అప్పటికే కొంత ఏసిడ్ దాని మెడ మీదకూడా పడింది. ఆ బాధను భరించలేక విలవిల్లాడుతూ అరుస్తూంది. తల్లి పక్షి ఒక పిల్లను ముక్కున కరుచుకొని వెళ్ళి కాస్త అవతలగా నున్న వేపచెట్టు తొర్రలో ఉంచి మళ్ళీ రివ్వున వచ్చింది. ఈలోగా రెండో పిల్లను కరుచుకొని మగపక్షి ఎగరటానికి ప్రయత్నించి విఫలమయి గూటి లోనే పడిపోయి రెక్కలు టపటప కొట్టుకుంటూ దీనంగా అరవసాగింది. తల్లి పక్షి రెండో పిల్లనుకూడా ముక్కున కరుచుకొని రివ్వున పారిపోయింది.

ఆ దృశ్యం చూస్తూ కొంతసేపు నిచ్చెన మీద అలాగే ఉండిపోయాను. మగపక్షిది ఎంత గొప్ప త్యాగం! స్వార్థానికి ఇసుమంతయినా తావు లేని భావన! కొంతసేపు గూటిలోనే రెక్కలు కొట్టుకొని ఎగరలేక కిందకు జారి పడిపోయింది. నేలమీద ఇటూ అటూ కొట్టుకుంటూంది. అప్పటికే దాని మెడ, రెక్కల కింది భాగం బాగా కాలి నల్లగా అయి పోయింది.

గబగబా నిచ్చెన దిగాను.

దగ్గరున్న నీళ్ళగొట్టంతో పక్షిమీద నీళ్ళు చల్లటానికి యత్నించాను. దానికి కొంతవరకూ బాధోపశమనం చేయటం తప్ప నేను చల్లే నీళ్ళు ఎందుకూ పనికి రావని తెలుసు. ఎందుకంటే, అప్పటికే అది బాగా ఏసిడ్‌తో తడిసిపోయింది. నేను దగ్గరకు వెళితే నన్ను చూసి బెదిరి, ఎగరటానికి యత్నించి మళ్ళీ పడిపోతూంది. దాని కున్న బాధతోబాటు నేను ఏమైనా చేస్తానసే భయంకూడా దాన్ని ఆవరించినట్లుంది. ఎగరటానికి ఇంకా ఎక్కువ శక్తితో ప్రయత్నించ సాగింది. దాని దగ్గరకు వెళ్ళటానికి నాకు మరి మనస్కరించలేదు. కొంతసేపు బాధతో విలవిల్లాడి ప్రాణం విడిచింది అది! అంతలోనే అక్కడకు ఆడపక్షి వచ్చింది. దానికి పరిస్థితి అర్థమయిపోయినట్లుంది. వెల్లకిలా పడి కళ్ళు తేలవేసిన మగపక్షి చుట్టూ 'కీ', 'కీ' మని అరుస్తూ చాలాసేపు తిరిగింది.

దాని కన్నుల్లో నీళ్ళు తిరిగాయా? ఏమో? నేను చెప్పలేను! కాని, దాని రోదన వింటూంటే హఠాత్తుగా వినయ్ భార్య జ్ఞాపకానికి వచ్చింది. హాస్పిటల్‌లో ఆ నాడు చూసిన దృశ్యం మళ్ళీ కనుల ముందు తిరిగింది. చాలాసేపు అరిచి అరిచి వెళ్ళిపోయింది ఆడపక్షి. మనసంతా కలచివేసినట్లయింది.

మెల్లగా కాబిన్‌లోకి వెళ్ళి తలుపేసుకున్నాను.

● ● ●

ఆ మరునాడు మధ్యాహ్నం డ్యూటీకి వచ్చేసరికి పిడుగులాటి వార్త తెలిసింది. వినయ్ భార్య పసికందు లిద్దరినీ వదిలి ఆత్మహత్య చేసుకుందట! రాత్రి నిద్ర మాత్రలు ఎక్కువ మోతాదులో మింగి చనిపోయిందట. 'తన పిల్లలిద్దరినీ పెంచి పెద్దవాళ్ళను చేసే సామర్థ్యం తనకు లేదనీ, వాళ్ళను దీనమయిన స్థితిలో తాను చూడలే'ననీ ఉత్తరం వ్రాసిపెట్టి ఆత్మహత్య చేసుకుందట. నా మనసంతా అదోలా అయిపోయింది.

ఆలోచించినకొద్దీ వినయ్ భార్య ఆత్మహత్యను నా మనసు సమర్థించలేకపోయింది. వినయ్ భార్య చదువుకున్నదే. ఇంతో అంతో లోకజ్ఞానం తెలిసిన మనిషే! ఆమె ప్రయత్నిస్తే ఏ చిన్న ఉద్యోగమయినా సంపాదించటం ఏమంత కష్టం కాదు. ఆ ఇద్దరు పిల్లల్నీ పెంచి పెద్దవాళ్ళను చేయటం కొంచెం కష్టమే అయినా, దుస్సాధ్యం మటుకు కాదు. ఇప్పుడు ఆ పసికందు లిద్దరూ అనాథ లయిపోలేదూ? వాళ్ళకి దిక్కెవరు? చని పోయినవారి ఆత్మలు పైన తిరుగాడుతూ ఉండటమే నిజమయితే, ఆ అనాథ పిల్లల ఆర్తనాదాలతో ఆమె ఆత్మ క్షోభించదూ? సమస్యకు కొని తెచ్చుకున్న చావే పరిష్కారమా?

వినయ్ భార్య ఘోరమయిన తప్పిదం చేసింది. వినయ్ ఆమెను ఏ లోకం నుండి చూసినా క్షమించలేడు.

వినయ్ పిల్లల భవిష్యత్తు గురించి రాజన్ మిగిలిన మిత్రులతో చర్చిస్తున్నాడు. నేను మౌనంగా కంట్రోలు రూము దాటి మేడమెట్లు దిగి కిందికి వచ్చాను. తల ఎత్తి పైకి చూస్తే, ఏసిడ్‌తో తడిసి నల్లబడిన పుడకలగూడు సగం కాలి ఆరిపోయిన చితి తాలూకు చిహ్నంలా కనుపించింది. అంతలోనే పక్షిపిల్లలు జ్ఞాపకానికి వచ్చాయి. ఇంకో వైపు అనాథలయిన వినయ్ పిల్లలు కళ్ళముందు మెదిలారు. వినయ్ భార్యకు మల్లే తల్లి పక్షి వాటికి అన్యాయం చేసి పోయిందా?! పక్షి పిల్లల్ని గురించిన ఆత్రత పెరిగింది. మెల్లగా వేపచెట్టు దగ్గరకు వెళ్ళాను. శబ్దం చేయకుండా చెట్టు ఎక్కి తొర్ర వంక చూశాను. పక్షి పిల్లలు రెండూ అందులో ఉన్నాయి! అవి కాస్త ఎదిగాయి. కువకువలాడుతూ రెక్కలు కొట్టుకుంటూ ఇటూ అటూ గెంతుతున్నాయి. అంతలోనే ఎక్కడినుండో ఎగిరివచ్చింది తల్లిపక్షి! తన నోట కరుచుకు వచ్చిన పురుగుల్ని తమాషాగా పిల్లలకు అందిస్తూంది! ఆకలిగొన్నట్లున్నాయి—ఎర్రని ముక్కు నోళ్లు తెరుచుకొని పిల్లలు వాటిని ఆరగిస్తున్నాయి. మనసు వర్ణించలేని తృప్తితో నిండిపోయింది!

ఆ దృశ్యం చూస్తూ కొంతసేపు అలాగే ఉండిపోయాను! *